# నాన్నగారి జ్ఞాపకాలు

- డా.గాయత్రీదేవి



1974 నుంచి దాదాపు ఒక దశాబ్దం పాటు ఆశేష ఆంధ్ర శ్రోతలనీ ఆకాశవాణి విజయవాడ కేంద్రానికి కట్టిపడేసిన కార్యక్రమం – ధర్మ సందేహాలు(వ్యాసపీఠం). ఆ కార్యక్రమం అంత ఆసక్తికరం కావడానికి ముఖ్యకారణం శ్రీ ఉషశ్రీ – ఉషశ్రీగారి గంభీరగళం, అనితరసాధ్యమైన కథనశైలి. ఆ రోజుల్లో ఆదివారం మధ్యాహ్నం ఆకాశవాణి విజయవాడ కేంద్రం నుండి ఈ కార్యక్రమం ప్రసారమయ్యే సమయంలో ఏ పూటకాపూట సంపాదించుకుంటే కానీ రోజుగడవని రిక్షా వాళ్ళు కూడా బేరం దొరికినా రిక్షా కట్టేవారు కాదు, కార్యక్రమం పూర్తయేవరకూ. ఏ కిళ్ళీ కొట్టు దగ్గరో చేరి, భక్తిశ్రద్ధలతో 'ధర్మసందేహాలు' కార్యక్రమం విన్నాకనే బేరం చూసుకునేవారు. అంతగా పామరులనీ పండితులనీ సమంగా ఆకర్షించింది ఆ కార్యక్రమం. ఆ ఆకర్షణ ఎంతంటే – నాలుగు దశాబ్దాల తర్వాత ఈ రోజుకి కూడా రామాయణ, భారతాల ప్రవచనాలంటే ఉషశ్రీ గారినే గుర్తుచేసుకుంటున్నారు.

ఉషశ్రీ గళానికి ఉన్న శక్తి కలానికి కూడా ఉంది. ఉషశ్రీ రాసిన రామాయణ, భాగవత, భారత కథలని చదువుతోంటే విన్నట్లే ఉంటుంది. ఆయన కలం నుండి జాలువారిన రచనలు ఒక్కొక్కటీ ఎన్నో లక్షల ప్రతులుగా ప్రజల దగ్గరకి చేరి వాళ్ళ ఇళ్ళల్లో గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయి.

ఉషశ్రీగారి సాహిత్యాన్ని ఈ తరానికి అందించడంలో విశేషమైన కృషి చేస్తున్నారు, వారి కుమార్తె డా.గాయత్రీ దేవిగారు.

'నాన్నగారి జ్ఞాపకాలు' శీర్షికలో డా.గాయత్రీదేవిగారు ఉషశ్రీగారి జీవితాన్ని ఈ తరం పాఠకులకు 'కౌముది' ద్వారా అందిస్తున్నారు.

( క్రిందటి సంచిక నుంచి తరువాయి)

## మహా నిర్యాణం




బుద్ధుడి లాగానే మహావీరుడూ కూడా శాంతి కోసం ఉపదేశం చేసిన గొప్ప ప్రవక్త. ఆయన పేరున్న హాస్పిటలే మాకా సమయానికి కావల్సింది.

అక్కడ డాక్టర్ల కన్న నర్సుల తోటే పని ఎక్కువగా ఉండేది. పెంఢ్యాల గారు నాన్నతోనే ఉండేవారు. నేను రాత్రుళ్ళు ఇంటికి పిల్లదగ్గరకి వెళ్ళి వస్తూండేదాన్ని.

ఓ వారం ఉన్నామేమో మహావీర్ హాస్పిటల్లో. సెప్టెంబర్ ఎనిమిదో తారీకు విజయవాడ ప్రయాణానికి టిక్కట్లు కొనుకున్నాం. నాన్నకూ, నాకూ, అమ్మకూ, బుజ్జికీ, పెంఢ్యాలగారికీ. పిల్లకింకా టిక్కట్ వయస్సు రాలేదు.

ట్రీట్మెంట్ మానేసాక నాన్న మొహంలో కాస్త తెరిపి వచ్చింది. ఇంక విజయవాడ వెళ్ళిపోతున్నామంటే బాగా ఉత్సాహమూ వచ్చింది.

ఆ ఉత్సాహంలోనే ఎవరైనా హాస్పిటళ్లకి ఆంబులన్సులలో వచ్చి కార్లలో వెనక్కి వెళ్తారు. మనం కార్లలో వచ్చి ఆంబులన్సులలో వెళ్తున్నాం అని జోకేసారు.

సెప్టెంబర్ ఏడో తారీకు.

మర్నాడు ప్రయాణం కదా అని పసుపూ కుంకుమలతో చీర పెట్టడానికి దొడ్డమ్మవాళ్ళ ఇంటికి రమ్మంటే మా అమ్మ వెళ్ళింది. అదే అమ్మ అందుకున్న ఆఖరి పసుపూ కుంకుమ అవుతుందని ఎవరనుకుని ఉంటారు?

మరుక్షణం ఏమవుతుందో తెలియకుండా సాగుతుంది జీవిత నాటకం. పాత్రధారులకి ఎప్పటికప్పుడు స్క్రిప్ట్ అందిస్తూ ఉంటాడు కనిపించని అజ్ఞాత దర్శకుడు. నవ్వుతున్న పాత్ర హటాత్తుగా ఏడవాల్సి రావచ్చు. ఏడుస్తున్న పాత్రకి నవ్వే అవకాశం రావచ్చు. ఈ నాటకం విచిత్రం ఏమిటంటే – నాటకం వేసేవాళ్ళే చూసేవాళ్ళు కూడా.

పెండ్యాలగారూ, నాన్నా నేనూ మర్నాడు ప్రయాణం గురించి మాట్లాడుకుంటున్నాం. ఆయాలు వాళ్ళ వాళ్ళ మామూళ్ళకోసం మా గది చుట్టూ తిరుగుతున్నారు. ఎవరు ఎప్పుడు వెళ్ళిపోతారో వాళ్లకి తెలిసిపోతుంది లాగుంది.

హాస్పిటళ్ళు చూస్తే – చాలా వింతగా అనిపిస్తుంది. ఎవరైనా పోయినా సరే అక్కడి వాళ్ళు వాళ్లకి రావల్సిందని వాళ్లనుకున్న దబ్బుని రాబట్టుకుందుకు చూస్తూ ఉంటారు. వాళ్ళని ఏమంటాం? వాళ్ల జీవితం వాళ్లు చూసుకోవాలి. పోయినవాళ్ళు ఎలానూ పోయారు. ఆ వాతావరణంలో ఏది తప్పో ఏది ఒప్పో ఎలా చెప్పగలం?

కాటూరి విజయసారథి గారి పితృవనం నవలంతా స్మశానం నేపధ్యం తో నడుస్తుంది. అందులో తప్పొప్పులూ, న్యాయాన్యాయాలూ, ధర్మాధర్మాల గురించి విషయాలు దొర్లుతాయి. ఆ నవల నాన్నకి బాగా నచ్చింది. ఆ మాట ఎవరితోనో నాన్న మాట్లాడుతూ అంటే నేను విన్నాను.

మా మాటల మధ్యలో పెండ్యాల గారు బాత్రూంకి వెళ్ళారు. నాన్నా నేనూ ఇద్దరమే ఉన్నాం. నేను నాన్న తాగడానికి కాంప్లాన్ కలిపి, దగ్గరకి వెళ్ళి చెంచాతో గొంతులో పోస్తున్నాను. ఒక్క గుక్క వెళ్ళిందో లేదో – మరో చెంచాడు తీసేడప్పటికి – నాన్న నోట్లోంచి బయటకి కారిపోతోంది. నాకు కంగారొచ్చి పెండ్యాలగారిని పిలిచాను. ఆయన హడావిడిగా వచ్చి డాక్టర్ని పిలుచుకొచ్చారు. డాక్టరొచ్చి చూసారు. అంతే.

నాన్న ఆఖరి క్షణాల్లో కూడా ఉన్నానన్న తృప్తి మిగిలిందేమో తెలియదు. కానీ నాన్నని ఆఖరి క్షణాల్లో చూడాల్సొచ్చిందే అన్న బాధ కూడా మిగిలింది.

ఐతే ఆ క్షణం తృప్తీ బాధా ఏమీ తెలియవు. నాకేమవుతోందో తెలియలేదు. నేను కుర్చీలో వాలిపోయాను. నన్నలా చూసుంటే నాన్న ఎంత బెంబేలు పడిపోయేవారో. ఐతే చూడ్డానికి నాన్న లేరు. అప్పట్నుంచీ – నేనేం చేసినా చూసేందుకు నువ్వు లేవు.

అదే నాన్నని ప్రాణాలతో ఆఖరి సారి చూడ్డం. ఆ తర్వాత కొన్ని గంటలు నాన్నతోనే గడిపాను. ఆ అచేతన శరీరంతో.

మర్నాడు విజయవాడ ప్రయాణం కోసం కొనుక్కున్న రైల్ టిక్కట్లు అవసరం లేకుండా పోయాయి. రాత్రికి రాత్రి విజయవాడకి ఆంబులెన్సులో బయల్దేరాల్సి వచ్చింది.

అందులో నాన్నా, అమ్మా, నేనూ, దొడ్డమ్మా, శ్యామలానందప్రసాద్ గారూ. పాలపర్తి శ్యామలానందప్రసాద్ గారు మా ఇంట్లో మనిషి లాంటి వారే. ఆయన ఏదో పని మీద హైదరాబాద్ వచ్చి నాన్నని చూద్దామని మహావీర్ హాస్పిటలుకి వచ్చారు. తిరుగు ప్రయాణంలో ఆయనే నాన్నకీ నాకూ సాయం. నిజానికి – నాన్నది సాయం అవసరం లేని స్థితి. సాయం కావాలో అక్కర్లేదో తెలియని స్థితి నాది.

పిల్లా, బుజ్జీ, పెండ్యాలగారూ విడిగా బయల్దేరారు.

అంతవరకూ చేసిన ప్రయాణాలన్నీ నాన్న నాచేత చేయించినవి. అప్పటికి రెండు నెలల క్రితం విజయవాడ నుండి హైదరాబాద్ నాన్నని నేను తీసుకువెళ్ళాను కానీ – అప్పుడు నాన్న ఉన్నారన్న ధైర్యం ఉంది. తిరుగు ప్రయాణంలో నాతో నాన్న ఉన్నారో లేరో తెలియని స్థితి.

అచేతనంగా ఉన్న నాన్న మొహంలో ఏ భావమూ లేదు. నవ్వూ, కోపం, బాధా – ఏ భావమూ లేని నాన్న మొహాన్ని చూడ్డం ఎంత కష్టంగా అనిపించిందో. ఆరుగంటల పైన అలా కూచునే ఉన్నా. నాన్న పక్కనే ఉన్నా లేనట్లుగా.

చాలా ఏళ్ళ క్రితం హైదరాబాద్ నుండి విజయవాడ రైలు ప్రయాణం చేసాను నాన్నతో. ఆప్రయాణం నాన్న విజయయాత్రకి నాంది.

ఆంబులెన్సులో ప్రయాణం నాన్న అంతిమయాత్రకి నాంది.

నాన్న పక్కనే ఉన్నా లేనట్లు సాగిన ఆ ఆరుగంటల ప్రయాణం అయ్యేసరికి – నేను శారీరకంగా, మానసికంగా అలసిపోయాను.

విజయవాడలో మా ఇంటికి చేరేసరికి ఇంటి ముందంతా జనం. నాన్న ఆఖరి యాత్రకి సన్నాహాలు జరుగుతున్నాయి. ఆ కోలాహలం చూస్తే అది మరణానిదో కళ్యాణానిదో తెలియనట్లుంది.

వాళ్ళకి నాన్నని అప్పగించేసి నేను లోపలకెళ్ళిపోయాను. ఆ తర్వాత ఎవరు ఏం చేసారో నాకు తెలియదు.

ఊరేగింపుగా నాన్నని పెద్ద కార్లో తీసికెళ్ళిపోయారు. సన్మానాలూ ఊరేగింపులూ కొత్త కాదు నాన్నకి.

బంధువులూ, స్నేహితులూ, అభిమానులూ, ఆఖరికి నాన్నని కొంచెం తెలిసిన వాళ్ళూ – నాన్న ఆఖరియాత్రలో నాన్నతో ఉన్నారు.

మా నాన్న అంతిమ యాత్ర నాన్న ఉపన్యాసంలానే గంభీరంగా సాగిపోయింది.

అమ్మ ముచ్చటపడితే అమ్మా నాన్నా ఇద్దరూ ఉపనయనం చేసిన రాఘవబాబయ్యే అంత్యక్రియలు చేసాడు. రాఘవబాబయ్య ఎప్పుడూ మా ఇంటి పనులన్నీ నెత్తిన వేసుకుని చేసేవాడు. ఆ చెయ్యడంలో ఎప్పుడూ ఏదో చేస్తున్నాంలే అన్న ధోరణి ఉండదు. శ్రద్ధగా, అభిమానంతో చేసాడు. నాన్న అంత్యక్రియలూ అలాగే చేసాడు.

ఆరోజూ, మర్నాడూ – రేడియో, టీవీ, పేపర్లూ – అన్నీ నాన్న గురించి చెప్తూనే ఉన్నాయి.

ఏ మీడియా మీద్దైతే నాన్న ఆధిపత్యం సంపాదించుకుని దానికి ఓ గౌరవాన్ని అందించారో – అది నాన్న అంతిమ నివాళులు నాన్నకి ఘనంగా సమర్పించుకుంది.

నాన్న శరీరం నాన్న ప్రేమించే ప్రకృతిలో కలిసిపోయింది. ఉందోలేదో తెలియని ఆత్మ ఎటెళ్ళిపోయిందో, ఏం చేస్తోందో.

నాన్న వదిలివెళ్ళిన నాన్న పుస్తకాలూ, ఉపన్యాసాలూ మాత్రం ఈలోకంలో ఇంకా ఉన్నాయి. అవి ఉన్నంతకాలం నాన్న ఉన్నట్లే.

మా నాన్న లాంటి వాళ్ళు చిరంజీవులు.

(ముగింపు వచ్చే నెలలో)

ఈ వ్యాసాల ఆడియోలు ఇక్కడ వినవచ్చు: Link to Audios

**మా వెబ్ సైట్స్ - ushasri.com, drgayatridevi.com**

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments